



సిహెచ్.వి.బృందావనరావు

# తెలియకపోతే ఏం?

"నేను మనూరికి పోతాను నారాయణా, ఈ ఆఖరి రోజుల క్కడే వుండాలనుంది" అన్నది లక్ష్మీదేవమ్మ కొడుకుతో.

తల్లి మాటలకు స్థాణువే అయి నాడు నారాయణ.

"అదేందమ్మా. ఇక్కడ నీకు ఇబ్బందేముంది. నిన్నెవరైనా ఏమైనా అన్నారా? సుబ్బులేమైనా అన్నదా? పిల్లలెవరన్నా దుడుకుగా మాట్లాడినారా?" అన్నాడు బాధగా తల్లితో నారాయణ.

"ఛ... ఛ... అట్టాంటిదేమీ లేదు లేరా. అయినా నన్నెవరైనా ఎందుకంటారు. నాకే ఈ ఆఖర్రోజులు మనూళ్లోనే మనింట్లోనే వుండాలనుంది" అంది తల్లి.

తల్లి చెపుతున్నది అబద్ధం అని తెలుసు నారాయణకు. అయినా సుబ్బులు ఏమీ అనేది కాదే. అత్తను కన్నతల్లిలాగా చూసుకుంటుంది. అమ్మకూడా సుబ్బలక్ష్మిని కూతుర్లాగే చూసుకుంటోంది. మరి ఎందుకు వెళ్లిపోతానంటున్నది అమ్మ. ఇదీ నారాయణ మథనం.

లక్ష్మీదేవమ్మకు నారాయణ ఒక్కడే కొడుకు. ఏడెనిమిదేండ్ల నుంచీ పట్టణమూ నగరమూ కాని ఆ వూళ్లో ఓ చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడు. పల్లెలో లక్ష్మీదేవమ్మా ఆమె భర్తా ఉంటుండేవాళ్లు. నిరుడు లక్ష్మీదేవమ్మ భర్త చనిపోయాడు. తండ్రికి ఆరోగ్యం సరిగా లేదని ఓ నెలరోజులు ఉద్యోగానికి శెలవు పెట్టి భార్యాపిల్లల్ని తీసుకుని పల్లెకు వచ్చాడు నారాయణ. తండ్రికి అన్ని సేవలూ చేశాడు. ఊళ్లో వుంటే మంచి డాక్టరు చేత వైద్యం చేయించాడు. తగ్గిపోయిందనుకున్నారు. ఉన్నట్టుండి, ఉబ్బసం తిరిగిబెట్టి అకస్మాత్తుగా తండ్రి మరణించాడు.

తల్లిదండ్రులంటే గొప్ప అభిమానమూ, ప్రేమా - నారాయణకు. నారాయణ భార్య సుబ్బలక్ష్మి కూడా అత్తమామలిద్దర్నీ ఆపేక్షగా గౌరవంగా చూసుకునేది. తండ్రికి ఆఖరిదశలో సేవలు చేశాననే తృప్తితో గడిపాడు నారాయణ. తండ్రి అంత్యక్రియలు కూడా ఎంతో శ్రద్ధతో నిర్వహించాడు.

దినవారాలయ్యాక తల్లితో "అమ్మా, నువ్వూ రా ఇంక మాతోనే వుందువుగాని" అన్నాడు.

"అట్టాగే నాయనా! ఇంక ఇక్కడ ఎవరున్నారు నాకు. నీ దగ్గరకు రాక. ఇక్కడ ఒక్కదాన్నీ ఎట్లుండేది" అన్నది లక్ష్మీదేవమ్మ.

ఒక చిన్న ఇల్లూ రెండెకరాల పొలమూ ఉన్నది ఆ వూళ్లో వాళ్లకు. ఇంట్లో ఎవరో తెలిసిన వాళ్లను వుండమన్నారు. పొలం కౌలుకు ఇచ్చారు. తల్లితో సహా పట్నంలో తనింటికి వచ్చాడు నారాయణ. వచ్చి ఏడెనిమిది నెలలైంది.

మనవడినీ, మనమరాల్నీ ముద్దుచేస్తూ, కొడుకూ కోడలు చేత సేవలు చేయించుకుంటూ వారికి చేదోడువాదోడుగా వుంటూ సుఖంగా కాలం గడుపుతున్నది లక్ష్మీదేవమ్మ. నారాయణా అతని భార్య సుబ్బలక్ష్మీ కూడా ఎంతో అనురాగంతో తల్లిని చూసుకుంటున్నారు.

లక్ష్మీదేవమ్మ పల్లెటూళ్లో జీవనం గడిపిన వ్యక్తి. పల్లెల్లో ఇరుగుపొరుగునే గాక నలుగురిండ్లకూ పోయి పలకరించి, వారి యోగక్షేమాలు విచారించి వస్తుండేది. అదే అలవాటుతో పట్నంలో కూడా నలుగురితో కలుపుగోలుగా వుంటుండేది లక్ష్మీదేవమ్మ.

నారాయణా వాళ్ళూ ఉండే ఇంటి కాంపౌండులో ఓ ఎనిమిది వాటాలున్నాయి. అందరూ నారాయణలాగా అద్దెలకు ఉంటూ ఏవో ఉద్యోగాలు చేసుకునేవారే.

పొద్దునలేస్తే అందరిండ్ల పిల్లలతో కాంపౌండంతా సందడిగా వుండేది. అందరితోనూ ఇట్టే పరిచయాలు కలిపేసుకున్నది లక్ష్మీదేవమ్మ.

"అమ్మాయ్ సుభద్రా! పిల్లలు స్కూళ్లకు పోయినారా", "సుశీలా ఆవకాయ పెట్టావా", "వెంకట్రావూ, మీ నాన్నను డాక్టరుకు చూపించవా" అని అందర్నీ పేరు పేరునా పిలిచి వివరాలు కనుక్కుంటుండేది. వాళ్ళు కూడా "అయింది పిన్నీ! కాసింత కాఫీ తాగుదువురా పిన్నీ" అని పిలిచి స్నేహంగా వుండేవారు.

లక్ష్మీదేవమ్మకు సమవయస్కురాలు కూడా ఒకామె వుండేది ఆ కాంపౌండులో. ఆమెతో ఎక్కువ కాలం గడుపుతూ వుండేది. ఆమె భర్త నిత్యరోగి.

"నీకేమమమ్మా, నీ కోడలు దేవతలాంటి పిల్ల. అన్నీ అమర్చి పెడుతుంది నీకు. నీ కొడుకు కూడా నువ్వంటే ప్రేమగా వుంటాడు. నీ అదృష్టం అందరికీ వస్తుందా. నాకూ వున్నారు కొడుకూ కోడలూ- ఎందుకూ?" అని మూతి ముప్పై వంకర్లు తిప్పింది ఆమె ఒకరోజు.

"నీకు మాత్రం ఏమయింది? నీ కొడుకూ కోడలూ బంగారంలాంటి వాళ్ళు. నువ్వంటే బాగానే వుంటారు గదా" అంది లక్ష్మీదేవమ్మ.

"ఆ ఏం బాగోలే" అంటూ ఏమో చెప్పబోయింది ఆమె.

చాడీలు వినడం ఇష్టముండదు లక్ష్మీదేవమ్మకు.

"ఇదుగోచూడు సావిత్రమ్మా! మనం పెద్దవాళ్ళమైనాం. మన చాదస్తాలు మనకుంటాయి. ఇప్పుడు మనకు పనేమీ లేదు. పిల్లలంటావా వాళ్ళ ఉద్యోగాలూ, చాకిరిలూ, బాధలూ వాళ్లకుంటాయి. మన చాదస్తాలతో మనం వాళ్ళను విసిగిస్తూంటే ఎలా చెప్పు. నీ కొడుక్కూ కోడలికీ గూడా నీవూ మీ ఆయనా తప్ప పెద్దదిక్కు ఎవరున్నారు. ఏమైనా చిన్న చిన్న ఇబ్బందులొస్తే మనమే సర్దుకుపోవాలి" అని నెమ్మదిగా బోధపరుస్తున్నట్లు చెప్పింది.

"అదీ నిజమేలే" అంది సావిత్రమ్మ.

"అంతేకాదు సావిత్రమ్మా, సినిమాల్లో సూర్యకాంతంలాగానో, సీరియళ్ళల్లో కనిపించే కుచ్చితపు మనుషుల్లాగానో అంతా దుర్మార్గులైన మనుషులుం

దరు. ఆడవాళ్లైనా మగవాళ్లైనా ప్రతి వాళ్ళల్లో కొంచెం మంచీ చెడ్డా వుంటాయి. చదువుకున్న వాళ్ళు, లోకాన్ని అర్థం చేసుకున్నవాళ్ళూ, చెడ్డ ఏదో తెలుసుకొని సరిదిద్దుకుంటారు. అసలు తప్పులుచేయని మనిషెవరు లోకంలో. తప్పులు తెలుసుకొని మళ్లీ అట్టాచేయకుంటే అదీ ఎంతో గొప్ప. నువ్వు కొంచెం నీ కోడల్ని ప్రేమతో పిలిచి ఆప్యాయంగా పలకరించు. నీ కోడలంత మంచిది ఈ లోకంలో ఉండదు. అప్పుడు నీ కోడలికి నీ అంత మంచి అత్త మరెవరూ వున్నట్లు కనిపించదు తెలుసా..." అంది.

ఇలాగే మంచి మాటలు చెపుతూ అందరిలో మంచి పేరు తెచ్చుకున్నది లక్ష్మీదేవమ్మ.

ఉన్నట్లుండి ఒకరోజు సావిత్రమ్మ భర్తకు సీరియస్ అయింది. డాక్టర్ని పిలిపించాడు ఆయన కొడుకు. చివరకు ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చింది. నాలుగురోజుల తర్వాత ఆయన ఆస్పత్రిలోనే కన్నుమూశాడు. ఇన్ని రోజులూ లక్ష్మీదేవమ్మ వాళ్లతోనే వుండి ధైర్యం చెపుతూ ఎంతో చేదోడువాదోడుగా వుండింది. ఆ ముసలాయన జబ్బూ, ఆస్పత్రిలో వైద్యమూ, మరణమూ, ఆ తర్వాత శ్రాద్ధకర్మలూ ఆమె ఎంతో దగ్గరుండి గమనించింది. ఆమె చేసిన సహాయానికీ, చూపిన చొరవకూ, సావిత్రమ్మా ఆమె కొడుకూ, కోడలూ ఎంతో కృతజ్ఞతతో గద్గదమైనారు.

* * *



"అయితే నీ నిర్ణయం మార్చుకోనంటావు" అన్నాడు నారాయణ తల్లితో.

"మార్చుకోను. నేను ఊరికి పోవాల్సిందే" అంది లక్ష్మీదేవమ్మ.

"ఇక్కడ నీకు కష్టంగా వుందా అత్తయ్యా! మమ్మల్నొదిలి ఎందుకు పోదామనుకుంటున్నావు. మా మీద నీకు కోపం ఎందుకొచ్చింది?" అని బాధగా అడిగింది సుబ్బలక్ష్మి.

"ఛ..ఛ..అట్లా ఎప్పటికీ అనుకోవద్దు. మీమీద నాకు కోపమేంటే పిచ్చిదానా. మీరు తప్ప నాకింకెవరున్నారు" అంది లక్ష్మీదేవమ్మ.

"మరి పోదామనుకోవడం ఎందుకు? సంవత్సరం కూడా కాకుండానే మా మీద మొహం మొత్తిందా? ఈ వయస్సులో నువ్వొక్కదానివీ అక్కడ ఎలా వుంటావు?" అన్నాడు నారాయణ.

"నాలుగు మెతుకులు ఉడకేసుకుని తినే ఓపిక నాకుంది లేరా. కడుపునొచ్చినా, కాలునొచ్చినా నీకు తెలుపుతాను గదా" అంది.


"నీ మాటే నీది గాని మా మాటే వినవుగదా" అన్నాడు నిష్ఠూరంగా నారాయణ. లక్ష్మీదేవమ్మ పట్టు వదల్లేదు. ఆమెను పల్లెల్లో దించి వచ్చాడు. ఎంతచెప్పినా వినకుండా ఆమె తమను వదిలిపెట్టి ఎందుకు పోయిందో నారాయణకు అర్థమే కాలేదు. ఆమెకేదో బాధ కలిగిందనీ, అందుకే కోపం వచ్చి వెళ్లిపోయిందనీ, తమలో తామే బాధపడుతున్నారు నారాయణా సుబ్బలక్ష్మీ.

"నాయనమ్మ మళ్లీ ఎప్పుడొస్తుందమ్మా" అని అడిగే పిల్లలకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు.

* * *

పల్లెకు వచ్చిన లక్ష్మీదేవమ్మకు పొద్దుబాగానే పోతున్నది. దాదాపు ఏడెనిమిది నెలలు కొడుకు దగ్గర వుండి వచ్చినందున మనమడూ మనవరాలూ రోజూ జ్ఞాపకం వచ్చి బాధ కలుగుతున్నది.

తను పట్నంలో వుండగా సావిత్రమ్మ భర్త చనిపోయిన ఆ రోజు ఆమెకు మళ్లీ మళ్లీ జ్ఞాపకం వస్తున్నది. సావిత్రమ్మ కొడుకు ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడు. కుటుంబానికి బొటాబొటీగా సరిపోయే జీతం. ఏవైనా పెద్ద ఇబ్బందులు వస్తే తట్టుకోవడం కష్టమైన చాలా మామూలు జీవితాలు వాళ్లవి. తండ్రి ఆరోగ్యానికి చాలా ఖర్చయింది పాపం. ఉన్నట్టుండి ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చింది. దానికి ఇంకా ఖర్చయింది. అయినా ఆయన ఆస్పత్రిలోనే పోయాడు. డాక్టరు వెంటనే శవాన్ని ఇంటికి తీసుకుపొమ్మన్నారు. వాళ్ళుండే కాంపౌండులోని ఇళ్ళన్నిటికీ ఒకడే యజమాని. ఆ అద్దెఇంటి యజమాని శవాన్ని ఇంట్లోకి తీసుకొని రావడానికి ఒప్పుకోలేదు. ఇంట్లో శవం పెడితే ఆ తర్వాత అద్దెకు ఎవరూ రారని ఆయన వాదన. ఎంత బ్రతిమాలినా అతని మనసు కరగలేదు. ఆస్పత్రివాళ్ళు శవాన్ని తీసుకుపొమ్మని తొందర చేస్తున్నారు. అద్దె ఇంటి యజమాని తీసుకు రానివ్వడం లేదు. అటునించి అటే స్మశానానికి తీసుకుపోవాలంటే ఆఖరిచూపుకోసం బంధుమిత్రులు రావలసి ఉంది. పాపం సావిత్రమ్మకొడుకు తండ్రిపోయిన బాధ అటుండగా భయంకరమైన డైలమాలో, బాధలో, చికాకులో సతమతమైపోయినాడు. అయినవాళ్లందరికీ తెలిపి వారంతా వచ్చి ఆఖరిచూపు చూసిందాకా వుంచుకునే వీల్లేకపోయింది. అటువంటి సమయంలో నేనున్నానంటూ ధైర్యం చెప్పడానిక్కూడా ఆ మహాపట్నంలో ఎవరూ ముందుకు రాలేదు. అప్పటి అతని అవస్థ పగవాళ్ళక్కూడా కలగ్గూడదనిపించింది. 'ఏం మనుషులు, ఏం బ్రతుకులు. పక్కవాడికి కొద్దిపాటి కష్టమొచ్చినా పల్లెలో అయితే ఒకరు కాదు, ఊరు ఊరంతా కదిలి వస్తుంది. డబ్బు అనేది మనిషిలోని అన్ని ఆర్ద్రతలనూ నాశనం చేస్తుంది కాబోలు. అన్ని సంబంధాలూ, ఆర్థికసూత్రాల ఇరుసుమీదనే పరిభ్రమిస్తున్నాయనేది ఎంత నిజమో ఇలాంటి సందర్భాల్లో అనుభవమౌతుంది' ఇట్లా ఆలోచించుకుంటూ ఉండిపోయింది లక్ష్మీదేవమ్మ.




'తన కొడుకూ కోడలూ మాటను కాదని పల్లెకు వచ్చినందుకు వారు బాధపడితే పడనీ, నేనేమో ముసల్దాన్నయిపోతిని. ఏ నిమిషాన గుటుక్కుమంటానో తెలియదు. నారాయణ వుండేది కూడా అద్దె ఇల్లే. తాను చనిపోతే అద్దె ఇంటి యజమాని శవాన్ని ఇంట్లో వుండనీయడు. నారాయణ అసలే అర్భకుడు. ఎన్ని అవస్థలు పడాల్సొస్తుందో. అదే పల్లెలో అయితే వార్త కొడుక్కు తెలియగానే వస్తాడు. నా ఇంట్లో నేను ఏ బాధా లేకుండా మరణించొచ్చు. పల్లెలో, అన్నా, బావా అని వరసలు కలుపుకుంటూ పిలుచుకునే ఇరుగుపొరుగుల సాయంతో నారాయణకు ఏమీ కష్టం లేకుండా జరిగిపోతుంది. ఈ వయసులో కొడుకు దగ్గరుండి అతనికి ఇలాంటి కష్టం కలిగించడం ఇష్టం లేకనే పల్లెకు వచ్చాననే సంగతి వారికి తెలియకపోతే ఏం? వారికెట్లాంటి కష్టమూ కలక్కుండా వుంటే చాలు' అనుకొని నిట్టూర్చింది లక్ష్మీదేవమ్మ మాతృహృదయం.

○



## కొడుకు పుట్టాడు

ప్రేమించుకుని పెళ్లిచేసుకున్న సినీదంపతులు సూర్య-జ్యోతికలకు ఓ కూతురు వున్న సంగతి తెలుసు కదా! లేటెస్టుగా ఇప్పుడా జంటకి కొడుకు కూడా జన్మించాడు. జూన్ 7న పండంటి మగబిడ్డని ప్రసవించింది జ్యోతిక. ఆ సమయానికి 'రక్తచరిత్ర' కోసం ముంబయ్‌లో వున్న సూర్య- వెంటనే చెన్నయ్ వచ్చేసి తన వంశోద్ధారకుడిని చూసుకుని మురిసిపోయాడట. కొడుకు పుట్టాక సూర్య కెరీర్‌లో మరింత కలిసొస్తుందని ఆశించడంలో తప్పేం లేదుగా!